క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి చిల్లపుట్టుగ గ్రామంలో ఈనెల 26వ తేదీన విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన మూడు బాధిత కుటుంబాలను సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి గురువారం పరామర్శించారు. దీనిలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఘటనపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీకి తెలియజేసి, బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్టు ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పూడి జగన్నాథపురం గ్రామానికి చెందిన జుత్తు నీలమ్మ ఇంట్లోకి వరద నీరు చేరింది. వరద నీరు తొలగించేందుకు కుటుంబ సభ్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో వారి కుటుంబానికి హ్యాండ్స్ టుగెదర్ ట్రస్టు సభ్యులు నిత్యావసర సరుకులు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు ఆదినారాయణ, కోదండరావు, గణపతి, సింహాచలం, పాపారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో కార్డెన్ సెర్చ్



ఇళ్లలో తనిఖీలు చేపడుతున్న దృశ్యం

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిఆంధ్ర వీధిలో గురువారం ఉదయం టెక్కలి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ విజయ్‌కుమార్, రూరల్ సీఐ శ్రీనివాసరావుతో పాటు ఎస్‌ఐలు సిబ్బంది శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి అనుమానిత ఇళ్లలో తనిఖీలు చేశారు. గంజాయి, సారావంటి నిషేధిత పదార్థాలు ఉన్నాయనే అనుమానంతో వెతికారు. అదేవిధంగా వీధిలోని ఆటోలు, ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలించి, సరైన రికార్డులు లేని సుమారు 13 ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు.

యోగాతో మానసిక ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

నందిగాం: యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పలు శాఖల ఉద్యోగులతో గురువారం యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో యోగా ఆవశ్యకతను తెలియజేయాలని సూచించారు. అలాగే అధిక సంఖ్యలో ప్రజలు యోగా డేలో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, ఉపాధి హామీ సిబ్బంది, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న అధికారి లక్ష్మీనారాయణ

ఇచ్ఛాపురం రూరల్: కుల, మతాలకు అతీతంగా ప్రజలంతా ఐక్యతతో ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని డొంకూరు గ్రామానికి చెందిన హిందూ, క్రిస్టియన్ వర్గాల మధ్య నెలకొన్న మతపరమైన వివాదం నేపథ్యంలో బూర్జపాడు గ్రామ సచివాలయంలో క్రైస్తవులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాల పేరిట గ్రామాల్లో విధ్వంసం సృష్టించేందుకు ఇరువర్గాల్లో ఎవరు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మతాలకు అతీతంగా అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. సమావేశంలో రూరల్ ఎస్‌ఐ ఈ.శ్రీనివాస్, ఉప తహసీల్దార్ బి.శ్రీహరి, ఈవోపీఆర్డీ ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిల్లు విడుదల చేయాలి



మేము జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తిచేసి సుమారు 9 నెలలు కావస్తోంది. ఇంతవరకు ఒక్క బిల్లు కూడా విడుదల కాలేదు. మా ఇంటి నిర్మాణం చేపట్టినప్పటికి సాధారణ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమై, ఎన్నికల కోడ్ రావడంతో బిల్లులు మంజూరవ్వలేదు. ఇంటి నిర్మాణాన్ని అప్పుచేసి చేపట్టాము. ఇప్పటికైనా బిల్లులు విడుదల చేస్తే అప్పుల నుంచి విముక్తి కలుగుతుంది.

– ముత్యాల రోజారాణి, బలియాపుట్టుగ, కంచిలి మండలం

నడక కూడా నరకమే



గత ప్రభుత్వంలో మంజూరైన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నాం. అయితే ఇప్పటివరకు మా కాలనీలో ఎటువంటి రహదారులు నిర్మించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షంపడితే దమ్మమడులను తలపిస్తూ నడక కూడా నరకమవుతోంది. ఇటీవల కాలంలో కొంతమంది తమ సొంత డబ్బులతో తాత్కాలిక రహదారులు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి కాలనీకి రోడ్లు నిర్మించాలని కోరుతున్నాం.

– డి.దమయంతి, జగనన్న కాలనీ, టెక్కలి

సదుపాయాలు పెంచాలి



ప్రస్తుతం మందస మండల కేంద్రంలో ఉన్నటువంటి మందస పంచాయతీ పరిధి జగన్న కాలనీలో ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు సిద్ధమవుతున్న తరుణంలో మౌలిక సదుపాయాలు పెంచాలని కోరుతున్నాం. అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తే మహిళలకు, కుటుంబాలకు అనుకూలంగా ఉంటాయని ఆశిస్తున్నాము. రోడ్లు, తాగునీటి వంటి సౌకర్యాలు కొరతగా ఉన్నాయి. అధికారులు స్పందించి తక్షణమే ఏర్పాటు చేయాలి.

– రాయవల మీన, జగనన్న కాలనీ, మందస

మౌలిక వసతులు లేవు



గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కాలనీల్లో ఎటువంటి మౌలిక వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇళ్ల నిర్మాణాల కోసం ప్రతీ లే అవుట్‌లో బోరు వేయించారు. అదే విధంగా ప్రతీ ఇంటికి విద్యుత్ మీటర్లను కూడా ఉచితంగా అందజేశారు. ప్రస్తుతం నిర్మాణాలు పూర్తి చేసుకున్నాం. అయినప్పటికీ కాలనీల్లో స్ట్రీట్‌లైట్లు, రోడ్లు, కాలువలు, తాగునీటి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా నాయకులు, అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

– జి.జోగారావు, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

పేదల ఇళ్లపై పక్షపాతమా..?

● జగనన్న కాలనీలపై కూటమి కక్ష ● మౌలిక సదుపాయాల కల్పనపై శీతకన్ను
● ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు

రాష్ట్రంలో అర్హులైన పేద, సామాన్య వర్గాలకు చెందినవారికి సొంత ఇళ్లు లేదనే మాట లేకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సొంత ఇంట్లో ఉండాలనే ఉన్నతాశయంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ఖరీదైన ప్రాంతాల్లో రూ.లక్షలు విలువ చేసే ఇంటి స్థలాలను అందజేసి కొత్తగా గ్రామాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా ఏ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలనే ఆలోచన చేయలేదు. అంతేకాకుండా జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనపై పూర్తిగా వివక్షత చూపుతోంది. ఇటీవల పల్లె పండగ పేరుతో హడావుడి చేసిన ప్రభుత్వం, ఆయా కాలనీల్లో రోడ్ల నిర్మాణాలపై ఆసక్తి చూపలేదు. అలాగే కాలనీల్లో వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో అక్కడి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: జగతిమెట్ట వద్ద జగనన్న కాలనీలో అధ్వాన్నంగా ఉన్న రోడ్లు



కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం బెండికొండపై జగన్న కాలనీ



టెక్కలి జగతిమెట్ట వద్ద ఏర్పాటైన జగనన్న కాలనీ

మండలం	లబ్ధిదారులు	జగనన్న కాలనీ లే అవుట్లు
టెక్కలి నియోజకవర్గంలో...		
టెక్కలి	1,027	24
నందిగాం	620	30
సంతబొమ్మాళి	531	30
కోటబొమ్మాళి	711	32
ఇచ్ఛాపురం నియోజకవర్గంలో...		
ఇచ్ఛాపురం	1,261	20
కంచిలి	928	25
కవిటి	1,709	15
సోంపేట	2,823	16
ఇచ్ఛాపురం మున్సిపాలిటీ	1,508	7
పలాస నియోజకవర్గంలో...		
పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ	2,000	1
పలాస	533	24
మందస	800	20
వజ్రపుకొత్తూరు	657	19



కంచిలి: రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టని బలియాపుట్టుగ జగనన్న కాలనీ

కక్ష సాధింపు చేస్తున్నారు



గత ప్రభుత్వ హయాంలో పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో రెండు వేలకుపైగా ఇళ్లను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు పట్టణాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతంలో రోడ్లు, తాగునీరు, వీధి దీపాలు, రేషన్, అంగన్‌వాడీ, వైద్యం వంటి సౌకర్యాలు దూరంగా ఉన్నాయి. ఇంటింటికీ కుళాయిలు బిగించారు కానీ తాగునీరు రావడం లేదు. అనేక మందికి బిల్లులు సైతం రావాల్సి ఉన్నాయి. జగనన్న కాలనీపై కక్ష సాధింపు ధోరణి కాకుండా సౌకర్యాలు కల్పిస్తే ప్రజలు హర్షిస్తారు.

– బద్రి సీతమ్మ, జగనన్న కాలనీ, పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీ

రోడ్లు నిర్మించక అవస్థలు



జగనన్న కాలనీలో నివాసం ఏర్పాటు చేసుకున్న మాకు ప్రభుత్వం రోడ్లు వేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. దీనివలన రాకపోకలు సాగించడానికి అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం రోడ్ల నిర్మాణాలు చేపట్టాలి.

– డొక్కరి భారతి, బలియాపుట్టుగ, కంచిలి మండలం

సీసీరోడ్డు లేకపోవడంతో ఇక్కట్లు



నౌపడ పంచాయతీ కూర్మనాథపురం జగనన్న లే అవుట్‌లో సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతోంది. అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి.

– పి.గోవింద్, కూర్మనాథపురం, సంతబొమ్మాళి మండలం

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్‌శాఖ ఏఈ శశిభూషణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్కలి విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నౌపడ, భావనపాడు, మర్రిపాడు, యామలపేట, హనుమంతునాయుడుపేట, మూలపేట, కె–లింగూడు, మేఘవరం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు, రొయ్యల చెరువులు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఇది ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వం'



కంచరాన చినబాబు

కాశీబుగ్గ: ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగుల వ్యతిరేక ప్రభుత్వం ఉందని, కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడు కంచరాన చినబాబు గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వలంటీర్లు, రేషన్ వాహన ఆపరేటర్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం సెకండరీ గ్రేడ్ సీనియర్ ఉపాధ్యాయులకు పీఎస్ హెచ్ఎం పోస్టులు ఇవ్వకుండా తీవ్ర అన్యాయానికి గురి చేస్తోందన్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులైన వీఆర్వోలను పార్టీ కార్యక్రమాలకి ఉపయోగించుకోవడం దారుణమన్నారు. టీడీపీ కార్యక్రమాలకు రాకపోతే డ్వాక్రా మహిళలపై చర్యలు తీసుకుంటామని భయపెట్టడాన్ని ఖండిస్తున్నామన్నారు.

ఆలయ ప్రతిష్ఠకు శుభరాట



జలయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని అమీన్‌సాహెబ్‌పేటలో ఉమాసహిత చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్ఠకు గురువారం శుభరాట కార్యక్రమం నిర్వహించారు. అలాగే బాహుదా నది నుంచి జలయాత్రను శోభాయమానంగా చేపట్టారు. కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వానప్రస్థాశ్రమం నిర్వహణకు ఇచ్ఛాపురం మండలం ఈదుపురంలో 1991–1992లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేశారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగింపులో భాగంగా ఈ మొత్తాన్ని గురువారం ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. అదేవిధంగా ఆశ్రమంలో ఉన్నవారికి రొట్టెలు, బిస్కెట్స్, తినుబండారాలను పంచిపెట్టారు.

సర్వసభ్య సమావేశం నేడు

ఇచ్ఛాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మున్సిపాలిటీకి సంబంధించి పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సభ్యులందరూ హాజరవ్వాలని కోరారు.

కామరాజు మృతి తీరనిలోటు



కామరాజు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: మండంలోని కుసుంపురం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సింధుల కామరాజు మృతి పార్టీకి తీరనిలోటని జెడ్పీ చైర్‌పర్సన్, ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా విజయ అన్నారు. ఈ మేరకు గురువారం కుసుంపురంలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఊర్మిళ బిసాయి, గ్రామపెద్దలు బత్తిన ధర్మారావు, బత్తిని కృష్ణారావు, శివ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టడానికే మహానాడు



పేరాడ తిలక్

టెక్కలి: ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టడానికే టీడీపీ పార్టీ మహానాడు పేరుతో మరో డ్రామాకు తెరలేపిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఏం మంచి చేశారని మహానాడు నిర్వహించారంటూ మండిపడ్డారు. కడపలో కేవలం కార్యకర్తలను రెచ్చగొట్టి విధ్వంసం సృష్టించడానికి మహానాడు పేరుతో పన్నాగం పన్నారన్నారు. ప్రతీ ఎన్నికల్లో చంద్రబాబు చెప్పిన అబద్ధపు హామీలకు ప్రజలు మోసం పోవడం సర్వసాధారణంగా మారిందన్నారు. ఏడాది కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఇటువంటి నాటకాలకు స్వస్తి పలికి హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఆర్థిక సాయం అందజేత



ఇచ్ఛాపురం రూరల్: ఆర్థిక సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు



టెక్కలి రూరల్: మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: చిన్ననాటి స్నేహితుడు మృతి చెందడంతో అతని కుటుంబానికి తోటి స్నేహితులు చేదోడుగా నిలిచారు. కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురం పంచాయతీ సింహాద్రిపురం గ్రామంలో అకాల మరణం చెందిన సనపల చక్రధర్ కుటుంబానికి అతనితో కలిసి 10వ తరగతి చదువుకున్న తోటి స్నేహితులు రూ.80 వేల ఆర్థిక సాయం గురువారం చేశారు. కార్యక్రమంలో గొండు నారాయణరావు, గుంట సోమేశ్వరరావు, కూన కోటేశ్వరరావు, కిల్లి అరవింద్, తిర్లంగి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన యువకుడు లింగరాజు బిసాయి గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన లింగరాజు వైద్యానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలుసుకున్న కేశుపురం కాళీమాత సేవా సమితి సభ్యులు స్పందించారు. గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలి



సిబ్బందికి సూచనలిస్తున్న ఏవో శ్రీదేవి

కవిటి: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు వ్యవసాయ సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలని ఏవో పి.శ్రీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయశాఖ సహాయకులతో కార్యాచరణపై సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఈ సీజన్‌లో 3,000 ఎకరాల్లో వరిసాగు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. దీనికోసం వరి విత్తనాలు వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఏఈవో బి.శ్రీకల్యాణ్, వ్యవసాయ సహాయకులు సమన్వయి, అమూల్య, గణపతి, రోహిత్, సాయికుమార్ పాల్గొన్నారు.

పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న ఎంపీపీ దేవదాస్ రెడ్డి తదితరులు

కంచిలి: మండలంలోని తలతంపర పంచాయతీ పరిధి చిల్లపుట్టుగ గ్రామంలో ఇటీవల విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆయా కుటుంబాలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి గురువారం సాయంత్రం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, పార్టీ నేతలు లడ్డుకేశవపాత్రో, కొణపల సురేష్, తలగాన తిరుపతి, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బృందావన్‌సాహు, ఖెత్రో దొళాయి ఉన్నారు.

సేంద్రియ సేద్యం.. భూసారం పదిలం

● ఆసక్తి చూపుతున్న రైతులు
● పొలం దున్నే సమయంలోనే చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: తొలకరి ముందు రైతులు తమ పొలాల్లో పశువుల ఎరువులు వేస్తుంటారు. కొద్దిరోజుల తర్వాత భూమిని దున్నే సమయంలో మరికొంత జీవాల ఎరువులు వేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రసాయనిక ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తిస్తున్న పలువురు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారిస్తున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలనిచ్చే సేంద్రియ ఎరువులను వినియోగించాలన్న వ్యవసాయాధికారుల సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో



చెరువు మట్టిని పంట పొలాల్లో వేస్తున్న రైతులు



బూర్జపాడు పంట పొలాల్లో వేసిన పశువుల ఎరువులు

రైతులు పశువుల పేడ, చెరువులు, కుంటల్లో పూడిక మట్టిని పొలాల్లో వేసుకుంటున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో చాలామంది రైతులు ఈ సేంద్రియ సాగు విధానానికి సన్నద్ధమవుతున్నారు. తరచూ రసాయన ఎరువుల వినియోగం వల్ల భూసారం తగ్గి పంటలకు చీడపీడలు సోకి ఉత్పత్తులు తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రైతులకు ప్రయోజనం

సేంద్రియ ఎరువుల వాడకం వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయని అధికారులు సూచిస్తున్నారు. పశువుల పేడ, పూడిక మట్టి వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయని చెబుతున్నారు. అంతేకాకుండా భూమిలో తేమశాతం ఎక్కువ రోజులు ఉండి పంటలు ఎండిపోకుండా దోహదపడతాయని చెబుతున్నారు. సేంద్రియ ఎరువులు వాడిన పొలాల్లో చీడ పీడలు, తెగుళ్లు సోకవన్నారు. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషక విలువలు లభించడంతో పైర్లు అధిక దిగుబడి ఇస్తాయని పేర్కొంటున్నారు.

దిగుబడి బాగుంటుంది



పంట వేసే ముందు పశువుల ఎరువును ఎకరాకు నాలుగు ట్రక్కులు వేసి కలియ దున్నడం వల్ల భూమి గుల్లబారుతుంది. పంట దిగుబడి కూడా బాగుంటుంది. భూమిలో నీటి తేమ ఎక్కువగా ఉంటుంది. మొక్కలకు రోగ నిరోధక శక్తిగా ఉపయోగపడుతుంది. పైరు ఎదుగుదల బాగుంటుంది. చీడపీడలు సోకకుండా ఉంటాయి. వేపపిండి కలపడం ద్వారా పురుగులు నశిస్తాయి.

– డాక్టర్ టి.భార్గవి, మండల వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం